క్లుప్తంగా

సత్యమ్మ తల్లికి విశేష పూజలు



కె.పట్నంలో సత్యమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని కె.పట్నంలో సత్యమ్మ తల్లికి భక్తులు విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం సత్యమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో అంబలి పోసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవారికి పసుపు,కుంకుమ, సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం పూజలు చేసి ధూపదీప నైవేద్యం సమర్పించారు. 8వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు భక్తితో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, నాయకులు దూర్వాసులు రెడ్డి, నిరంజన్ రెడ్డి, వేణురెడ్డి, బాబురెడ్డి, ప్రసాద్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయండి



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈఓలు

చిత్తూరు రూరల్: నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ సెల్వరాజ్ ఆదేశించారు. చిత్తూరు మండలం బంగారెడ్డి జెడ్పీ హైస్కూలులో నాడు-నేడు పనులను ఆయన గురువారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు ఉండేలా చూడాలన్నారు. అనంతరం పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 మోహన్ పాల్గొన్నారు.

ద్రవరూపంలో పంటలకు ఎరువులు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

యాదమరి: ద్రవరూపంలో పంటలకు ఎరువులు వేస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ ఏఓ చరిత రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ముత్తరపల్లెలో ఇఫ్కో సౌజన్యంతో ద్రవరూప ఎరువులు నానో యూరియా, నానో డీఏపీని పంటలకు పిచికారీ చేసే కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడారు. ద్రవ రూపంలో ఉన్న ఎరువులు వాడదలచిన రైతులు ముందుగా తమ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఫ్కో ఫీల్డ్ ఆఫీసర్ దిలీప్, రైతులు పాల్గొన్నారు.

చవటపల్లె వార్డు సచివాలయం తనిఖీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం చవటపల్లెలోని వార్డు సచివాలయాన్ని గురువారం జెడ్పీ



తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ నిర్వహణ బోర్డులు, సంక్షేమ పథకాల అర్హుల జాబితాను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను చూశారు. స్పందన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని, ఇళ్ల నిర్మాణ పనులను వేగవంత చేయాలని ఆదేశించారు.

పాఠశాల తనిఖీ

గుడిపాల: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ముఖ్యమని మండల విద్యాశాఖాధికారి-2 గణపతి అన్నారు. గురువారం వసంతాపురం ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. గతంలో కన్నా ఈ విద్యాసంవత్సరం విద్యార్థుల నమోదు పెరిగిందని ఉపాధ్యాయుడు లోకనాథం తెలియజేశారు.

విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక వీరభద్రకాలనీలో గురువారం ఉదయం 5 గంటలకు నుంచి దాదాపు 9 వరకు విద్యుత్ అంతరాయం కలిగింది. దీంతో స్థానికులు అధికారులకు సమాచారం చేరవేశారు. స్పందించిన సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజ్ కాలిపోయినట్లు గుర్తించారు. దానిని మార్చి కరెంటు సరఫరా పునరుద్ధరించారు.

డివైడర్‌ను ఢీకొని ఆటో బోల్తా

పూతలపట్టు: మండలంలోని ఎం.బండపల్లె వద్ద డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా పడింది. వివరాలు.. గురువారం చిత్తూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు వేగంగా వెళ్తుండడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కారులోని ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు.

ప్రజలకు ఎంతో సంతోషం

- 'జగనన్న సురక్ష'లో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సర్టిఫికెట్లు లబ్ధిదారులు ఇంటి వద్దకే అందుతున్నాయని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో గురువారం 12, 22, 37వ వార్డు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా ఇవ్వడం వల్ల ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వలంటీర్లు, వార్డు కార్యదర్శులు సచివాలయ పరిధిలో ఇళ్లకు వెళ్లి, వారి అవసరాలు తెలుసుకుని అవసరమైన సంక్షేమ పథకాలు, సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. మేయర్ ఎస్. అముద మాట్లాడుతూ, జగనన్న సురక్ష కార్యక్రమంతో పేదలకు మేలు కలుగుతోందని, ఆర్థిక భారం పడకుండా సర్టిఫికెట్లు ఉచితంగా అందుతున్నాయన్నారు. కమిషనర్ జె.అరుణ మాట్లాడుతూ, జగ నన్న సురక్ష కార్యక్రమంపై వార్డు సచివాలయం పరిధిలో ముందస్తుగా అవగాహన కల్పించాలని, ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని కార్యదర్శులు, వలంటీర్లను ఆదేశించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు.

759 మందికి మేలు

జగనన్న సురక్ష కిందమూడు డివిజన్లలో ప్రజలు కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలతో పాటు ఇతర సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 759 మంది దరఖాస్తు చేసుకుంటే వంద శాతం అందరికీ సర్టిఫికెట్లను మంజూరు చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు ఎస్.మధుబాబు, పి.గంగ, కె.నిర్మల, కో-ఆప్షన్ మెంబర్ కె. కిరణ్ కుమార్, సహాయ కమిషనర్ గోవర్ధన్, సీఎంఎం గోపి, మునిసిపల్ ఆర్ఐలు అమర్‌నాథ్‌రెడ్డి, ఆదాము ఇతర అధికారులు పాల్గొన్నారు.

అసలు ఇచ్చేవాళ్లు కాదు



మాకు ఇన్‌కమ్ సర్టిఫికెట్ కావాలని ఎంఆర్‌ఓ ఆఫీస్‌కు పోతే ఇంతకుముందు ఇచ్చేవాళ్లు కాదు. రేషన్‌కార్డు ఉంటే చాలు.. ఇన్‌కమ్ ఇచ్చేదిలేదని చెప్పినారు. కానీ ఇపుడు జగనన్న సురక్షలో ఇన్‌కమ్ సర్టిఫికెట్‌కు పెట్టుకున్న వెంటనే ఇచ్చేసినారు. దీనివల్ల ఆఫీసుల చుట్టూ తిరిగే పనితప్పింది. పిల్లోళ్లకు కాలేజీల్లో కరెక్ట్ టైమ్‌కు ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఇచ్చేదానికి కుదిరింది. **- పాకీజ, కిచిడీ మకాన్‌వీధి, చిత్తూరు**

450మంది కార్మికులకు రూ.31.22 కోట్లు

- 'ప్రజా సంకల్పయాత్ర' హామీని నెరవేర్చిన సీఎం జగన్
- బకాయిల చెల్లింపుపై షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల హర్షం



ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను సన్మానించిన షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల కల నెరవేరింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో బకాయిలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల విడుదల చేశారు. దీనిపై గురువారం షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను ఆయన నివాసంలో సన్మానించారు. ఆయనతో పాటు చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్‌ను సత్కరించారు. బకాయిల విడుదలతో 450 మంది కార్మికుల ఖాతాల్లో రూ.31.22 కోట్లు జమ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజాసంకల్పయాత్రలో జగనన్న ఇచ్చిన హామీని నెరవేర్చి, తమ జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ ముందుకు వెళ్తోందన్నారు. ఇందులో భాగంగానే కార్మికుల వేతనాల చెల్లింపు, అమూల్ డెయిరీ ప్రారంభం, నగర సచివాలయాలకు రూ.50 లక్షలు నిధులు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ప్రసాద్‌రెడ్డి, కేశవరెడ్డి, బాబు, దేవరాజులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సందీప్



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందిస్తున్నామని గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సందీప్ అన్నారు. గురువారం వసంతాపురంలో 104 వైద్య శిబిరం నిర్వహించారు. రోగులు, గర్భవతులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. వైద్యసిబ్బంది నరసింహులు, విజయ, జబసెల్వి, ఉమామహేశ్వరి, ప్రవీణ్, మార్కొండయ్య, చంద్రశేఖర్, సుజిమ, స్వప్న, మంజుల, లక్ష్మి పాల్గొన్నారు.

ఇరువారంపల్లెలో...

ఐరాల: మండలంలోని ఇరువారంపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 85 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్‌ఎస్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దిగువమాఘంలో..

తవణంపల్లె: మండలంలోని దిగువమాఘంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 104 మొబైల్ మెడికల్ క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి తనిఖీ చేశారు. 104 శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా మందులు అందజేయాలని ఆదేశించారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మండల వైద్యాధికారి ప్రియాంక, ఆరోగ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవజాత శిశువులకు కంటి పరీక్షలు



పసికందుకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్: చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని జిల్లా బాల భవిత కేంద్రంలో గురువారం నవజాత శిశువులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఎస్పీ అరవింద్ ఐ ఆస్పత్రి వైద్యులు ప్రతి నెల రెండు రోజుల పాటు కేంద్రంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో నెలలు నిండకనే పుట్టిన శిశువులకు, రక్త మార్పిడి చేసిన పిల్లలకు, వెంటిలేటర్, ఆక్సిజన్ అసవరమైన వారికి, మెదడులో రక్తస్రావం సమస్యలు ఉన్న చిన్నారులకు రెటీనా సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఈ క్యాంపు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆ వైద్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కేంద్రంలోనే పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు చేయించారు. ఈ పరీక్షలకు మంచి స్పందన లభించింది. 26 మంది పిల్లల తల్లులు హాజరై వైద్యుల సూచనలు-సలహాలు పొందారు. కార్యక్రమంలో వైద్యులు దుర్గా ప్రసాద్, షాలిని, మురళి, విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు శునకాలకు వ్యాక్సినేషన్



శునకాలకు టీకాలు వేస్తున్న పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్

చిత్తూరు అగ్రికల్చర్: పెంపుడు జంతువుల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్ అన్నారు. గురువారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక దర్గా సర్కిల్ వద్ద పశు వైద్యశాలకు తీసుకువచ్చిన పెంపుడు శునకాలకు ఆయన టీకాలను వేశారు. పెంపుడు జంతువుల్లో ప్రధానంగా కుక్కల వలన వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పెంపుడు జంతువులకు ఏటా క్రమం తప్పకుండా టీకాలు వేయించడం వల్ల మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా కట్టడి చేయవచ్చని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతిదేవి తెలిపారు. పెంపుడు జంతువులను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి

చిత్తూరు కార్పొరేషన్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 122వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. స్థానిక జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద గురువారం బీజేపీ ఓబీసీ జిల్లా కోశాధికారి షణ్ముగం పుష్పాంజలి ఘటించారు. అనంతరం 100 మంది విద్యార్థులకు బిస్కెట్లు, పెన్నులు అందజేశారు. నాయకులు గోకుల్‌యాదవ్ పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ వ్యర్థజలాలతో కలుషితం

బంగారుపాళెం: శ్రీనిఫుడ్స్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థ జలాలతో గౌరీశంకర తటాకం చెరువు కలుషితమం అవుతోందని మండలంలోని గౌరీశంకరపురం గ్రామస్తులు తెలిపారు. గ్రామసమీపంలోని ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థజలాలను గౌరీశంకర తటాకం కాలువలోకి మళ్లించడంతో చుట్టుపక్కల రైతులకు ఇబ్బందిగా మారిందన్నారు. కాలువలో చేపలు సైతం మృతి చెందాయన్నారు. కలుషిత నీరు భూమిలోకి ఇంకి వ్యవసాయ బోరుబావులు సైతం కలుషితం అవుతున్నాయని వాపోయారు. పలుమార్లు ఫ్యాక్టరీ యాజమాన్యం దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేదన్నారు. అధికారులు స్పందించి ఫ్యాక్టరీ వ్యర్థజలాలను వంకల్లోకి మళ్లించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రమేష్ బాబు, త్రివేణి, పద్మ, నాగరత్నం ను తోటి ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. ఎంఈఓ-1 రుక్మిణి, ఎంఈఓ-2 ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హెచ్‌ఎం లలిత, సర్పంచ్ రాధ, ఎంపీటీసీ దుర్వాసులు, ఉపాధ్యాయులు కనకాచారి, మదన్‌మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తప్పవు

పూతలపట్టు: మండలంలోని వేపనపల్లె సమీపంలో ఓ హోటల్ నుంచి వెలువడే కలుషిత నీరు తమ పొలంలోకి వస్తోందని ఓ రైతు పదిరోజుల కిందట ఎంపీడీఓ గౌరికి ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, వ్యర్థాలను పక్క పొలాల్లోకి మళ్లించకుండా 3 రోజుల్లో ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హోటల్ యజమానిని హెచ్చరించారు. ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ మంజునాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఈగా కేశవులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో గిరింపేట సెక్షన్ ఏఈగా కేశవులు బాధ్యతలు స్వీకరించారు. పుత్తూరులోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం ఏఈగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఏఈగా ఉన్న కేశవచంద్ర ఈఈ కార్యాలయ వాణిజ్య విభాగానికి బదిలీ కావడంతో సంతపేట సెక్షన్ ఏఈ బాలచంద్ర ఇన్‌చార్జిగా వ్యవహరించారు. నూతన ఏఈ కేశవులు మర్యాదపూర్వకంగా డీఈ శేషాద్రి, ఈఈ పద్మనాభపిళ్లైను కలిశారు.

ఘనంగా కుంభాభిషేక పూజలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం సంతపేటలోని దక్షిణామూర్తి దేవాలయ మహా కుంభాభిషేక పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. పండితులు హోమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సన్మానించి ప్రసాదం అందజేశారు. పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

హైకోర్టు సీజేను కలిసిన న్యాయవాదులు

చిత్తూరు అర్బన్: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకట శేషసాయిని చిత్తూరు న్యాయవాద సంఘ నాయకులు గురువారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరు న్యాయవాద సంఘ అధ్యక్షులు రాజేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్, సభ్యులు వెంకటాపతి నాయుడు, షఫీ ఉల్లా, వెంకటేష్ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

కేంబ్రిడ్జి అవార్డుకు మేథిని ఎంపిక



చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని క్యాంఫోర్డ్ పాఠశాల డైరెక్టర్ మేథినికి కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రదానం చేసే అధ్యాపకుల శిక్షణ ఆవిష్కరణ అవార్డుకు ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించి ఆ యూనివర్సిటీ డైరెక్టర్ సుయాష్‌బట్ అవార్డు ప్రదానోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానం పంపారు. 1991 నుంచి చిత్తూరులో క్యాంఫోర్డు విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. పలు అంశాల్లో ప్రతిభ చాటినందుకు గాను దేశవ్యాప్తంగా 20 పాఠశాలల నిర్వాహకులను అవార్డులకు ఎంపిక చేశారు. ఈ నెల 8న కేంబ్రిడ్జి యూనివర్సిటీలో మేథిని అవార్డును అందుకోనున్నారు. ఆమెను కరస్పాండెంట్ మహేష్ రెడ్డి, పాఠశాల బృందం అభినందించింది.

వందశాతం బిల్లులు వసూలు చేయండి



మాట్లాడుతున్న ఏఏఓ బ్రహ్మయ్య, ఈఈ హరి

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు రూరల్ పరిధిలో వంద శాతం ప్రైవేటు బిల్లులు వసూలు చేయాలని ఏఏఓ బ్రహ్మయ్య, ఈఈ హరి ఆదేశించారు. గురువారం రూరల్ ఈఈ కార్యాలయంలో డీఈ, ఏఏఓ, ఏఈలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డివిజన్ పరిధిలోని 7 సెక్షన్లలో గత నెల మొత్తం రూ.3.40 కోట్లు ప్రైవేటు కలెక్షన్స్ వసూలైందన్నారు. ఇలా ప్రతినెల 100 శాతం బిల్లులు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సకాలంలో చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ కొండయ్య, ఏఏఓ గీత, ఏఈలు గుర్రప్ప, తనిగవేలు, రామిరెడ్డి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బంగారు రథంపై విఘ్నేశ్వరుడి విహారం



మాడవీధుల్లో ఊరేగుతున్న స్వామివారి బంగారు రథం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గురువారం రాత్రి బంగారు రథంపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సంకటహర చతుర్థి గణపతి వ్రతం సందర్భంగా రాత్రి ఆలయంలోని కల్యాణ వేదికలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామిని కొలువుదీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ అధికారులు, ఉభయదారులు, ఊరేగింపుగా మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం బంగారు రథాన్ని ఆలయ మాడవీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఘనంగా ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి ఆలయ అధికారులు, ఉభయదారులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముడి చక్రస్నానం



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె: టి.పుత్తూరు కోదండరాముల వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం స్వామి వారి పుష్కరిణిలో వైభవంగా చక్రస్నానం నిర్వహించారు. తొలుత ఉదయం ఆలయంలో అర్చకులు సీతారామలక్ష్మణులకు, ఆంజనేయస్వామికి అభిషేకం, పూజలు చేయించారు. అనంతరం ఉభయదారులు స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం చేయించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం మోహిని ఉత్సవం, సాయంత్రం ఉట్లోత్సవం నిర్వహించారు. రాత్రి ఆలయంలో అర్చకులు ధ్వజావరోహణం నిర్వహించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



రికార్డులను పరిశీలిస్తున్న చేస్తున్న జెడ్పీచైర్మన్

బంగారుపాళెం: గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని తిమ్మోజుపల్లె గ్రామ సచివాలయాన్ని గురువారం మధ్యాహ్నం ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలో తప్పనిసరిగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని, ప్రజా వినతులను అలసత్వం వహించకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గృహనిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు..

గంజాయి విక్రేత అరెస్టు



నిందితురాలి అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: గంజాయి విక్రయిస్తున్న మహిళను వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ విశ్వనాథరెడ్డి కథనం.. చిత్తూరులోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీనిపై నిఘా ఉంచగా, తమిళనాడు నుంచి గంజాయి తెప్పించి చిత్తూరులో చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి ఇరువారానికి చెందిన దేవయాని (58) అనే మహిళ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఆమెను కట్టమంచి చెరువు వద్ద అరెస్టు చేసి రెండు కిలోల గంజాయిని సీజ్ చేశారు. దాడుల్లో ఏఎస్ఐ ఉమామహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు



ఎగువ తవణంపల్లెలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు



జంగాలపల్లెలో..



మల్లకుంటలో..

తవణంపల్లె: జగనన్న సురక్ష క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగనన్న సురక్ష క్యాంపు పూతలపట్టు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు కోరారు. గురువారం ఎగువ తవణంపల్లెలో జగనన్న సురక్ష క్యాంపును సర్పంచ్ చిట్టెమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ప్రత్యేక అధికారి పరిశీలించారు. ఎగువ తవణంపల్లెలో 226 మందికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. భూరీసర్వే డీటీ వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీలు బాబు, డేవిడ్, నాయకులు గాంధీబాబు, మధుకుమార్, ప్రకాష్‌బాబురెడ్డి, చిట్టిబాబు పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: సీఎం జగనన్నకు మేము చాలా రుణపడి ఉంటామని పలువురు లబ్ధిదారులు అన్నారు. జంగాలపల్లె గ్రామ సచివాలయంలో ప్రజలకు జగనన్న సురక్షపై అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్ సర్పంచ్ రవి హాజరయ్యారు.

ప్రజలకు మేలు చేయడానికే..

తవణంపల్లె: మండలంలోని మల్లకుంటలో గురువారం జగనన్న సురక్ష గ్రామసభను సర్పంచ్ రంజిత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయాలనే సంకల్పంతోనే జగనన్న సురక్ష పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ కుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు రవిరెడ్డి, రాజారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నదే అని ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి అన్నారు. ఈచనేరిపల్లె గ్రామ సచివాలయంలో గురువారం సర్పంచ్ అనురాధ అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. జెడ్పీటీసీ సోమశేఖర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మరోమారు జగనన్నను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. తుంబపాళెం పంచాయతీ కచ్చటివారిపల్లెలో 36 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను మంజూరు చేశారు. అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పానాటూరు, బొమ్మసముద్రంలో..

గుడిపాల: జగనన్న సురక్షతో ప్రజల దరికే 11 రకాల సేవలు అందుతాయని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం పానాటూరు, బొమ్మసముద్రం పంచాయతీల్లో సర్పంచులు మధుసూదన్ రెడ్డి, సాధ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 400 మందికి 11 రకాల సర్టిఫికెట్లను అందజేశారు. ఎంపీటీసీ మొగిలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, ప్రవీణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాల: మండలంలోని ఇరువారంపల్లె, ఎం.పైపల్లె సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇరువారంపల్లె సచివాలయంలో 53, ఎం.పైపల్లె సచివాలయంలో 60 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీలమ్మ, ఎంపీడీఓ నాగరాజు, వైఎస్సార్‌సీపీ నేత ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఈచనేరిపల్లెలో..



గుడిపాల: బొమ్మసముద్రంలో..



ఐరాల : ఇరువారంపల్లెలో ..